క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠా మహోత్సవాలు


హోమంలో పాల్గొన్న గ్రామస్తులు

పీసీపల్లి: మండల పరిధిలోనే చిన్న వరిమడుగులో నూతనంగా సీతారాముని ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేస్తున్నారు. అనంతరం అన్న దానం ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు


ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న భాస్కర్‌రెడ్డి, కృష్ణమూర్తి

సీఎస్‌పురం(పామూరు): ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థులకు సాయంగా దాతల సాయం కొనియాడదగినదని పాఠశాల హెచ్‌ఎం షేక్.షరీఫ్ అన్నారు. మండలంలోని అంబవరం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మంగళవారం పాఠశాల పూర్వ విద్యార్థి ముదిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎస్ఆర్‌కే స్కూల్ యాజమాన్యం డాక్టర్ పి.కృష్ణమూర్తిలు పాఠశాలల్లోని గత ఏడాది పదో తరగతి టాపర్స్‌కు రూ.25 వేలు అందజేశారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

టంగుటూరు: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని టంగుటూరులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఫొటోగ్రాఫర్, వీడియోగ్రాఫర్ షేక్ బాషా, హరిబాబులు ఫొటోల ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. చుండి రమేష్, శ్రీహరి, కిరణ్, సుధాకర్ కోటి పసుమర్తి, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌కార్డుకు బ్యాంక్ లింక్ చేసుకోవాలి


రైతులతో మాట్లాడుతున్న ఏవో వెంకటేష్

మద్దిపాడు: ఆధార్‌కార్డుకు బ్యాంక్ లింక్ చేసుకుంటేనే అన్నదాత సుఖీభవ నగదు బ్యాంక్ ఖాతాలో జమవుతాయని వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్ తెలిపారు. మండలంలోని శివరాయునిపేట గ్రామంలోని రైతుసేవా కేంద్రం వద్ద ఆత్మ ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కాకర్లకు చెందిన 13 మంది రైతులు అన్నదాత సుఖీభవ నగదు జమ కాలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ఆధార్ కార్డును బ్యాంక్ లింక్ చేయించుకుంటే రెండో విడతలో నగదు జమవుతుందని తెలిపారు. నాగభూషణం, ఏఈఓ శ్రీను, కోటేశ్వరరావు, వీఏఏలు శ్రీను, కోటిరెడ్డి ఉన్నారు.

మూతపడిన వాటర్‌ప్లాంట్


మరమ్మతుల కారణంగా మూతపడ్డ వాటర్‌ప్లాంట్

సింగరాయకొండ: మండలంలోని బింగినపల్లి పంచాయతీలో దాతల సహకారంతో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్ మూతబడటంతో గ్రామస్తులు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దాతల సహకారంతో ప్లాంటు నిర్మించారు. ఈ ప్లాంటుకు పచ్చరంగు వేసి మరీ నిర్వహించారు. తరువాత ప్లాంట్ నిర్వహణ సక్రమంగా లేక చాలాసార్లు మూతపడుతూనే ఉంది. ప్రస్తుతం నాలుగు నెలలుగా ప్లాంటు పనిచేయటం లేదని, దీంతో బయట ప్రాంతాల నుంచి వచ్చే మంచినీటి ఆటోల కోసం వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొందని గ్రామస్తులు వాపోతున్నారు. ప్లాంటు వద్ద అయితే 20 లీటర్ల బబుల్ వాటర్ 10 రూపాయలకు లభిస్తుందని అదే బయట ఆటోలు అయితే రూ.15 చొప్పున కొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు. ఒకవేళ మంచినీరు అత్యవసరమైతే కిలోమీటరు దూరంలోని ఎస్టీ కాలనీకి గానీ, పెద్దన్నపాలెంకు గానీ వెళ్లి అక్కడి వాటర్‌ప్లాంటు నుంచి మోటారుసైకిళ్లపై తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందంటున్నారు. గతంలో ప్లాంట్ మరమ్మతులకు గురైనతే పంచాయతీ ఆధ్వర్యంలో మరమ్మతులు చేశారని, ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శి ప్లాంట్‌కు, గ్రామ పంచాయతీకి సంబంధం లేదంటున్నారని గ్రామస్తులు వాపోయారు. అధికారులు స్పందించి ప్లాంట్‌కు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకువచ్చి తాగునీటి ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.

అమ్మో...ఆ రోడ్డా...!

- అధ్వానంగా కొండపి -అనకర్లపూడి రహదారి
- ఆ నాలుగు కిలోమీటర్లు ప్రయాణించాలంటే వాహనదారుల బెంబేలు
- మట్టిరోడ్డును తలపిస్తున్న తారురోడ్డు
- గ్రానైట్, ఓవర్ లోడ్ వాహనాలతోనే ఈ దుస్థితి


మట్టి రోడ్డును తలపిస్తున్న కొండపి,అనకర్లపూడి ప్రధాన రహదారి


రోడ్డు మార్జిన్ పరిస్థితి

కొండపి:

మండలంలోని కొండపి-అనకర్లపూడి రహదారి అధ్వానంగా తయారైంది. చిన్న వర్షం కురిసిందంటే ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారుతోందని వాహనదారులు వాపోతున్నారు. కొండపి నుంచి సంతనూతలపాడు, చీమకుర్తి ఒంగోలుకు అనకర్లపూడి నుంచి ప్రధాన రహదారిగా వాహనదారులు, ఉద్యోగస్తులు ప్రయాణాలను కొనసాగిస్తున్నారు. ఈ రోడ్డు అన్ని ప్రాంతాలకు ప్రయాణానికి అనుకూలంగా ఉండడంతో అధిక శాతం ఇదే రోడ్డుపై వాహనదారులు ప్రయాణం చేస్తున్నారు.

తారు రోడ్డా..మట్టిరోడ్డా?

కొండపి నుంచి అనకర్లపూడికి ప్రయాణించడానికి నాలుగు కిలోమీటర్ల దూరం ఉంటుంది. కొండపి సాయిబాబా ఆలయం దాటిన తర్వాత నుంచి అనకర్లపూడి వెళ్లే వరకు రోడ్డుపై తారు కనిపిస్తే ఒట్టు. రోడ్డంతా గుంతలమయం కావడం, రోడ్డు మార్జిన్ సరిగా లేకపోవడంతో పొలంలో ఉన్న మట్టిని రోడ్డు మార్జిన్ కోసం గుంతలను పూడ్చడం కోసం ఉపయోగించారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో రోడ్డు పక్కన మార్జిన్‌కు వేసిన బంక మట్టి దిబ్బలు జారి రోడ్డు పైకి వచ్చి బురద బురదగా తయారైంది. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణమంటే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు.

గ్రానైట్, ఓవర్ వాహనాలతోనే..

చీమకుర్తి నుంచి టంగుటూరుకు గ్రానైట్ లారీలు, ఓవర్ లోడ్ గ్రావెల్ వాహనాలు వయా సంతనూతలపాడు, మూగచింతల, మద్దులూరు ప్రాంతాల మీదుగా అనకర్లపూడి నుంచి కొండపి వైపుగా టంగుటూరు వెళుతున్నాయి. చీమకుర్తి నుంచి ఒంగోలు మీదుగా టంగుటూరి వెళ్లాలంటే ఆర్టీఓ అధికారుల భయం, టోల్ ఫ్రీజ్ చెల్లించాలి అనే కారణాలతో కొండపి మీదుగా వాహనాలను టంగుటూరు హైవేకి తీసుకువెళ్లారు. అధిక లోడు కారణంగా రోడ్లు గుంతలు ఏర్పడ్డాయి. వాహనం సంతనూతలపాడు మూగచింతల మద్దులూరు మీదగా వచ్చిన ఏ వాహనం అయినా అనకర్లపూడి రావాల్సి ఉంటుంది. అక్కడ నుంచి కొండపికి నాలుగు కిలోమీటర్లు ఉంటుంది. ఈ అధిక లోడు వాహనాలు అన్ని ఈ ప్రాంతాలలో రోడ్ల మీద ప్రయాణించడంతో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఓవర్ లోడ్‌తో సహా అధిక వేగంతో వాహనాలు రావడంతో రోడ్లు పూర్తిగా గుంతలు పడి మరమ్మతులకు గురయ్యాయి. గ్రానైట్ యజమానులు అధికారుల భయం నుంచి తప్పించుకోవడానికి ఈ ప్రాంతంలో వాహనాలను తీసుకొని పోవడంతో రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని వాహనదారులు వాపోతున్నారు. ఈ మార్గంలో అధికారులు తనిఖీలు ఉండవని రాత్రిళ్లు గ్రానైట్ గ్రావెల్‌ను అధికంగా తరలిస్తూ యజమానులు జేబులు నింపుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.


ఎదురెదురుగా వాహనాలు రావడంతో మార్జిన్ దిగడానికి ఇబ్బంది పడుతున్న వాహనాలు


ప్రధాన రహదారిలో రోడ్డుమీద గుంతలలో నిలిచిన వర్షం నీరు

ఎదురు వాహనం వస్తే హడల్..

ఈ నాలుగు కిలోమీటర్ల ప్రాంతంలో ఎదురు వాహనం వస్తే వాహనదారులు హడలిపోతున్నారు. మార్జిన్ దిగితే వాహనం ఎక్కడ ఇరుక్కుపోతుందో మళ్లీ రోడ్డు ఎక్కుతామా లేదా అన్న ఆందోళన. పొలంలో మట్టి కావడంతో మార్జిన్ దిగితే టైరు ఇరుక్కుపోవడం, జారిపోవడం జరుగుతుందని భయాందోళనకు గురవుతున్నారు. గత బుధవారం, గురువారాల్లో ఎదురుగా వచ్చే వాహనాలు మార్జిన్ దిగకపోవడంతో దిగిన టైర్లు ఇరుక్కుపోవడంతో గంటలకొద్దీ ఆ ప్రాంతాలలో వాహనాలు పూర్తిగా ఆగిపోయాయి.

స్పందించని మంత్రి, అధికారులు

కొండపి నుంచి అనకర్లపూడికి ప్రయాణించాలి అంటే వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతుంటే నియోజకవర్గం మంత్రి స్వామి కనీసం స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2025 సంక్రాంతి నాటికి రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారని, కానీ సంక్రాంతి దాటి 8 నెలలైనా ఇంత వరకు తట్ట మట్టి పోయలేదంటున్నారు. ఇప్పటికైనా మంత్రి స్వామి అధికారులు స్పందించి రోడ్డు మార్గంలో ఉన్న పొలం మట్టిని తొలగించి, గుంతలను పూడ్చించి ప్రయాణానికి వాహనదారులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయాలి:



కొండపి నుంచి అనకర్లపూడి కి వెళ్లే రహదారిలో ప్రయాణించాలి అంటే హడలిపోతున్నాము. రోడ్డు అంతా మట్టితో నిండి ప్రయాణానికి ఏమాత్రం అనుకూలంగా లేవు. గ్రానైట్, గ్రావెల్ లారీలు అధిక లోడుతో వెళ్లడంతో రోడ్డు ఈ విధంగా తయారైంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డుపై మట్టి తొలగించి మార్జిన్లకు గ్రావెల్ వేసి వాహనదారుల కష్టాలు తీర్చాలి.

బచ్చల కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్

201 పొగాకు బేళ్లు తిరస్కరణ


వేలం నిర్వహిస్తున్న అధికారులు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం 201 పొగాకు బేళ్లను తిరస్కరించారు. క్లస్టర్ పరిధిలోని పెట్లూరు, ఎస్ఎస్ కండ్రిక, జగ్గరాజుపాలెం, వర్ధినేనివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 985 బేళ్లను తీసుకురాగా 784 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ఠ ధర రూ.281, కనిష్ఠ ధర రూ.140 పలికింది. వేలంలో 24 కంపెనీలు పాల్గొన్నాయి.


టంగుటూరులో వేలం

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేలంలో పొగాకు సరాసరి ధర.204.37 పలికిందని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. క్లస్టర్ పరిధిలోని టంగుటూరు, జరుగుమల్లి, సాదువారిపాలెం, వావిలేటిపాడు గ్రామాలకు చెందిన రైతులు 949 బేళ్లను తీసుకు రాగా 792 బేళ్లను కొనుగోలు చేసి 157 బేళ్లను తిరస్కరించారు. వేలంలో 19 కంపెనీలు పాల్గొన్నాయి.

గణేష్ ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి


అవగాహన కల్పిస్తున్న సీఐ సోమశేఖర్

పొన్నలూరు: గణేష్ ఉత్సవాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కొండపి సీఐ సోమశేఖర్ అన్నారు. మండలంలోని వెంకుపాలెం, పొన్నలూరు గ్రామాల్లో మంగళవారం స్థానిక ప్రజలతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవిత పండుగను మంచి వాతావరణంలో ప్రజలు సంతోషంగా జరుపుకోవాలన్నారు. పోలీసుల అనుమతులు లేకుండా గణపతి విగ్రహాలు ఏర్పాటు చేయరాదన్నారు. వినాయక మండపాలు, ఊరేగింపుల పేరుతో గ్రామాల్లో అల్లర్లు, గొడవలు సృష్టిస్తే వారిపై కేసులు తప్పవన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రజలు నడుచుకోని శాంతిభద్రతల విషయంలో పోలీసులకు సహకరించాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సై అనూక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాస్ పుస్తకాల్లో పొరపాట్లు సవరించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ నాగూర్‌మీరా

హనుమంతునిపాడు: రీసర్వే జరిగిన గ్రామాల్లో రైతుల పాసుపుస్తకాల్లో వచ్చిన తప్పిదాలను రైతులకు తెలియజేసి సవరించాలని తహసీల్దార్ షేక్ నాగూర్‌మీరా అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలు, సర్వేయర్లు, వీఏఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో భూముల రీ సర్వే 8 రెవెన్యూ గ్రామాల్లో పూర్తయిందన్నారు. నల్లగండ్ల, మాసాయిపేట, నీలకంఠాపురం, హనుమంతునిపాడు, కోటతిప్పల, ముప్పాళ్లపాడు, దాసళ్లపల్లి, అనందపురం అగ్రహారం గ్రామాల్లో రీ సర్వే జరిగిందని, వాటికి 650 వరకు పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చాయన్నారు. వాటిలో రైతుల పేర్ల తప్పిదాలు, ఫొటో మార్పిడి, విస్తీర్ణంలో తేడాలు ఉన్నాయని, వాటిని రైతులకు తెలియజేసి లాగిన్‌లో సవరించాలన్నారు. డీటీ రాజేష్, ఆర్ఐ జి.క్రిష్ణచైతన్య, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తను వర్మీ కంపోస్టుగా మార్చాలి


అవగాహన కల్పిస్తున్న డీపీఓ వెంకటనాయుడు

కొండపి: పంచాయతీలోని చెత్తను ఎప్పటికప్పుడు సేకరించి వర్మి కంపోస్ట్‌గా మార్చాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటనాయుడు అన్నారు. మండలంలోని వెన్నూరు, ముప్పవరం పంచాయతీలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిచెత్త, పొడి చెత్త గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పంచాయతీల్లో అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సరఫరా, పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. చోడవరంలో స్వామిత్వ కొలతల వివరాలను పంచాయతీ కార్యదర్శి సాంబయ్యను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ ఎంపీడీఓ అంజలీదేవి, పంచాయతీ కార్యదర్శులు రత్నప్రభ, కృష్ణ, సాంబయ్య, రామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లూరు జోనల్ ఇన్‌చార్జి ప్రెసిడెంట్‌గా గంగసాని లక్ష్మి


గంగసాని లక్ష్మిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ పర్వతనేని, జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ పూజిత

పామూరు: పామూరు ఎంపీపీ, వైఎస్సార్ సీపీ ప్రకాశం జిల్లా మహిళా విభాగం జోనల్ ప్రెసిడెంట్ గంగసాని లక్ష్మి నెల్లూరు జిల్లా ఇన్‌చార్జ్ జోనల్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఈసందర్భంగా మంగళవారం ఆమె నెల్లూరులో పార్టీ మహిళా విభాగం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మహిళా విభాగంలో జోనల్ కమిటీలు, మండల కమిటీలపై చర్చించారు. షనంతరం పలు పార్టీ కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెను ఎమ్మెల్సీ పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డి, జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాని పూజిత, జిల్లా మహిళా అధ్యక్షురాలు సునంద, ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సుహాసిని, పద్మ, పందిటి లక్ష్మి పలువురు పార్టీ మహిళాసంఘం నాయకులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా మంగళగౌరీ వ్రతం


ప్రత్యేక అలంకరణలో వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారు


మంగళగౌరీ వ్రతం సందర్భంగా అమ్మవారి ప్రత్యేక అలంకరణ


పెద్ద ఎత్తున వ్రతాన్ని ఆచరించిన మహిళలు

కందుకూరు: శ్రావణ మంగళవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పెద్దబజార్‌లో గల వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళగౌరీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. వేదమంత్రోచ్ఛారణల మధ్య సాగిన ఈ వ్రతంలో వందల మంది మహిళా భక్తులు పాల్గొని వ్రతాన్ని ఆచరించారు. అమ్మవారికి చేసిన ప్రత్యేక అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రాజాస్వామి మాట్లాడుతూ శ్రావణమాసం ఎంతో శుభప్రదమైన మాసమని, అటువంటి శ్రావణమాసంలో మంగళగౌరీ వ్రతాన్ని ఆచరించిన వారికి సకల శుభాలు కలుగుతాయని, వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆశిస్సులు ఉంటాయని వివరించారు. అనంతరం పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ కోట వెంకట నరశింహం, కోదండ రామాలయ ప్రెసిడెంట్ మరారిశెట్టి వెంకట సుబ్బారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యాంత్రీకరణపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి శేషారెడ్డి

వలేటివారిపాలెం: రైతులు వ్యవసాయంలో యాంత్రీకరణపై ప్రత్యేక దృష్టిసారించాలని ఏవో శేషారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అంకభూపాలపురం గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ యాజమాన్య పద్ధతులలో పంటలను సాగు చేసి తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించాలన్నారు. యాంత్రీకరణపై దృష్టి పెట్టి తక్కువ పెట్టుబడులతో ఎక్కువ ఆదాయం వచ్చేలా అభివృద్ధి చెందాలని ఆయన అన్నారు. యాంత్రీకరణపై సర్వే నిర్వహిస్తున్నారని, ప్రతి రైతు సొంతంగా ఉన్న లేక ప్రభుత్వ రాయితీల ద్వారా అందించిన ప్రతి వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు వివరాలు రైతు సేవా సిబ్బందికి తెలియజేయాలని ఆయన కోరారు. ఈ కార్యాక్రమంలో వీఏఏ సాయ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాన్ని ఉధృతం చేయాలి



ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళలు

కొండపి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రజా ఉద్యమాన్ని ఉధృతం చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి పిలుపునిచ్చారు. ఐద్వా ప్రకాశం జిల్లా13వ మహాసభల నేపథ్యంలో మంగళవారం కొండపిలో మహిళల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో బహిరంగ సభ ఐద్వా కొండపి మండల కార్యదర్శి విశ్రాంతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వర్గాలకు రాయితీలను ఇస్తూ సామాన్యుల ప్రయోజనాలను విస్మరిస్తుందని తెలిపారు. దేశవ్యాప్తంగా మహిళలు, మైనారిటీలు, బలహీన వర్గాలపై దాడులు జరుగుతుంటే అరికట్టడంలో విఫలం చెందిందన్నారు. అదానీ కంపెనీతో కుమ్మక్కై స్మార్ట్ మీటర్లు బిగిస్తూ ప్రజలపై పెను భారాలు మోపుతున్నారని మండిపడ్డారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోలవరం, బనకచర్ల ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని చెప్పారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ మహిళల సమస్యలపై సంఘటితంగా పోరాటం చేయాలన్నారు. తొలుత గుడిపల్లి చందు కళ్యాణ మండపం నుంచి కామేపల్లి బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వరకు కళారూపాలతో కూడిన ప్రదర్శన నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు కేజీ మస్తాన్, రైతు సంఘం నాయకులు మల్లెల కొండయ్య, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షర్మిల, జిల్లా ఆఫీస్ బేరర్లు మాలతి, రాజ్యలక్ష్మి, ఆదిలక్ష్మి, లక్ష్మీ ప్రసన్న, శారా తదితరులు పాల్గొన్నారు.

వయ్యారిభామతో పలు సమస్యలు


మాట్లాడుతున్న కేవీకే హెడ్ ప్రసాద్‌బాబు

కందుకూరు రూరల్: వయ్యారిభామ కలుపు మొక్కతో పలు సమస్యలు ఉంటాయని కందుకూరులోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మంగళవారం కేవీకే శాస్త్రవేత్తలు టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వయ్యారిభామ కలుపు నివారణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ జీ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు 16 నుంచి 22వ తేదీ వరకు వయ్యారిభామ కలుపు నివారణ వారోత్సవాలు చేపడుతున్నామని తెలిపారు. దాని నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కలుపు మొక్క దేశంలో సమస్యాత్మకంగా మారిందన్నారు. మనుషుల్లో, పశువుల్లో చర్మ వ్యాధులు, ఆస్తమా తదితర వ్యాధులు, మొక్కలలో వైరస్ తెగుళ్లు దీని ద్వారా వ్యాప్తి చెందుతాయన్నారు. దీనిని సామూహికంగా నివారించాన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్ మాట్లాడుతూ ఈ కలుపు ఒక మొక్క 25 నుంచి 30 వేల విత్తనాలను ఉత్పత్తి చేస్తుందన్నారు. నీటి ద్వారా, గాలి ద్వారా, వ్యవసాయ పని ముట్ల ద్వారా ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్తుందని చెప్పారు. కేవీకే శాస్త్రవేత్త జ్యోతి మాట్లాడుతూ ఈ కలుపును పూతకు రాకముందే పీకి తగులబెట్టాలన్నారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర అధ్యాపకుడు తిరుపతిస్వామి, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

కందుకూరు డివిజన్

90102 24456

Office mail : sakshiongads@gmail.com